నాకు నచ్చిన నా కథ



తేది 6-5-1978 ది సినీహెరాల్డ్ వార పత్రికలో ప్రచురించిన "అడుగుల భారం" కథ, నా కథలు అన్నిటిలోకి నన్ను బాగా ఆకట్టుకొన్న కథ.

కథకో ప్రయోజనం ఉండాలనేది నా గట్టి నమ్మకం, సహజంగా హాస్య కథలు, ప్రేమ కథలు పాఠకుణ్ణి తాత్కాలికంగా ఆకట్టుకోవచ్చు, ఆనందింప చేయవచ్చు కానీ, పాఠకుణ్ణి వెంబడించేది అతనికో ప్రయోజనం చేకూర్చగలిగేది -వినూత్న పంథాలో నడిచే సమస్యా-పూరితమైన కథలే. అందుకే క్రొత్త సమస్యలను పాఠకులముందు ఉంచాలనే నేను వివిధ జీవన లోతుల్ని త్రొవ్వుతుంటాను. అలాంటి లక్ష్యంలో నా కలం నుండి వెలువడిన కథలకు వ్రాయను మార్గదర్శి కాగలుగుతున్న కొన్ని కథలలో ఈ "అడుగుల భారం" మొట్టమొదటిది.

—ఈతకోట సుబ్బారావు

అడుగుల భారం

"నమస్కారం సార్!"

చదువుతున్న పత్రికనుంచి తలెత్తి చూశాను. ఎవరో అపరిచిత యువకుడు పాతికేళ్ళుంటాయేమో, నవ్వుతూ ఏమిటన్నట్టు అతనివైపు చూశాను. అతని కళ్ల లోని గాంభీర్యం, ధైర్యం చూసి ఒక్క క్షణం విస్తుపోయాను.

"నాపేరు కిరణ్ సార్! మీ 'జ్యోతి అవుట్‌డోర్ యూనిట్'లో లైట్ బోయ్‌గా పనిచేస్తున్నాను. మీతో కొంచెం ప్రైవేటుగా మాట్లాడదామని వచ్చాను సార్." మాటలతీరు చూస్తుంటే మొహమాటస్తుడుగా ఉన్నాడు. ఇలాటి వారు మాట్లాడేది నా అనుభవం ఎంతో నేర్పింది. జీతం పెంచమని కొందరు చిన్న చిన్న వేషాలు ఇప్పించమనేవారు. మరి కొందరయితే, రోజూ వచ్చే అభిమానులు మరికొందరు. ఇతను వీటికే చెంది ఉంటాడనే నమ్మకంతో "చూడండి మిస్టర్ కిరణ్! మా యూనిట్ బోయ్ అంటున్నారు! మీ కష్టసుఖాలు గాని, వ్యక్తిగత విషయాలు గాని యూనిట్ విషయాలు గాని, మేనేజర్‌గారితోనే మాట్లాడాలి" ఇలాంటివారిని వదిలించుకోవడానికి నే నవలంబించే మార్గాలలో ఇదొకటి.

"క్షమించండి సార్! నేను ముందుగా చెప్పాను ప్రైవేటుగా మాట్లాడవలసిన విషయమని మీరు ఆదివారం షూటింగ్‌లో పాల్గొనరు, ఖాళీగా వుంటారని ఇంటికెళ్ళాను సార్. డబ్బింగ్ ప్రోగ్రాం కొరకు ఇక్కడున్నారని తెలిసి, మీరు తప్పక సహాయం చెయ్యగలరని వచ్చాను సార్. నా ఆశ నిరాశ చెయ్యకండి సార్!"

అతని ప్రాధేయతకు నేను బాధపడిన విషయం నిజమేకాని నా బాధను అర్థంచేసుకొనే దెవరు? వారంరోజులు కెమెరాముందు ఆడి, పాడి, వారానికి ఒకరోజు రెస్ట్ తీసుకుందామంటే డబ్బింగ్ ప్రారంభోత్సవాలని కాళ్ళావేళ్ళ బడి లాక్కురావటం, లేకుంటే కట్టిస్తున్న స్టూడియో విషయాలుగాని, నడిపిస్తున్న అవుట్‌డోర్ యూనిట్ ప్రోగ్రాంలుగాని, నా కాల్‌షీటు విషయాలలో నా బాధ అర్థం చేసుకొనేదెవరు? ఏం చెపుతాడో విని చూద్దాం అనుకొని "చెప్పండి మిస్టర్, మీ పనేమిటో" అనడిగాను.

తల దించుకొని ఒక్క క్షణం తర్వాత 'ఇది పూర్తిగా నా వింత సమస్య సార్! మీ కెందుకు చెబుతున్నానంటే మీకీ సమయంలో నా ఆర్థిక సమస్య తీర్చగలరనే దృఢనిశ్చయముతోనే సార్" అన్నాడు.

"ఆర్థిక సమస్య" ఆశ్చర్యంగా అడిగాను.

"నా ప్రస్తుత ఆర్థికసమస్యకు కారణం ఒక రకంగా మీ యూనిట్ అని చెప్పగలను సార్. స్టూడియో యజమాని, ప్రముఖ హీరో ముందు కేవలం ఒక బోయ్ ఇలా మాట్లాడుతున్నందుకు క్షమించండి సార్

చెంపమీద కొట్టి రాజీకీయమన్నా, చెప్పుతో కొట్టి సారీ అన్నా, మానవత్వమున్న ఎవరు మాత్రం ఏం చేయగలరు. అందుకనే "పర్వాలేదు. చెప్పండి" అన్నాను.

నేను బి ఇ. పాసయ్యాను. నా మీద ఆధారపడి ఉన్న తల్లిదండ్రులు, మా యింటి ఒక్కగా నొక్క ఆడపడుచు, నా భార్య, నాకు తండ్రి బిరుదు సంపాదించిపెట్టిన నా రెండేళ్ళ కొడుకు, వీరికోసం, విజయవాడ 'విజయశ్రీ' లాడ్జిలో పనిచేస్తున్న రోజులవి. విజయవాడ పరిసరప్రాంతాలలో 'హీరో సుమంత్' గారి "కాలేజీ కుర్రాడు" చిత్రం షూటింగ్ జరుపుకొని ఓ రోజు రాత్రి నటీనటులు, దర్శక నిర్మాతలు, సాంకేతిక నిపుణులు ఆ చిత్రానికి పని చేసిన మీ జ్యోతి అవుట్‌డోర్ యూనిట్ మేనేజరూ, వీరందరూ కలసి మా లాడ్జిలో బసచేశారు. ఆ లాడ్జిలోనే తిరుగుతున్న నన్ను బోయ్‌చేత పిలిపించారు. ఏదో కంప్లెయింటు అని గాభరాగా వెళ్ళాను, ఆ పిలిపించింది ఎవరోగాదు మీ యూనిట్ మేనేజరుగారే. అతను చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోవటం నా వంతయింది ఒంటినిండా బంగారుపూత పూస్తున్నారో, కొండమీద కూర్చో బెడుతున్నారో నాకే అర్థంగాని సమయంలో "ఇప్పుడే ఏ విషయం చెప్ప నవసరంలేదు. నేను చెప్పింది మీ మంచి కొరకే. రాత్రి బాగా ఆలోచించుకునే రేపు ఉదయం చెప్పండి" అన్న అతని చివరి మాటలతో పంజరం విడిచిన పక్షిలా సంతోషంతో బయటపడ్డాను. ఆ రాత్రంతా ఈ ఊహలతోనే నిదుర పట్టింది కాదు. ఆ రాత్రంతా అతని మాటలే మననం చేసుకుంటూ గడిపాను. "ఈ కాలపు హీరోలకు మేడమెట్లు సరసరా దిగాలన్నా, పడ గెత్తాలన్నా, గుర్రం ఎక్కాలన్నా డూప్ ఎంతో అవసరం. కేవలం డూప్ పాత్రల కొరకు ఈ ఉద్యోగం ఎలా వదులుకోవాలని బాధపడతారేమో! మీరు ఆలోచించండి.



హీరో సుమంత్‌గారి ఒడ్డూ పొడుగూ విషయాలలో ఏ విధంగానూ తీసిపోరు. సుమంత్ గారి చిత్రాలన్నిటికీ మీరు ఉపయోగపడతారు. కేవలం ఇది పార్ట్‌టైం వర్క్‌గా భావించండి. మా యూనిట్‌లో మీకు పర్మనెంట్ ఉద్యోగం ఇప్పించగలను. పరిశ్రమలో అడుగుపెట్టిన తర్వాత నలుగురు పెద్దలు పరిచయమవుతారు. మీ గ్లామర్‌తో చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ మంచి పేరు తెచ్చుకోవచ్చు. ఇలా ఎన్నో చెప్పిన తర్వాత నాకు తోచిందల్లా పెద్దలు చెప్పినట్లు అదృష్టమనేది వడిలో వచ్చి కూర్చోదు. కాళ్ళదగ్గరకు వచ్చిన దాన్ని తన్నకుండా వంగి తీసుకోవటం మేలనిపించింది, అందుకనే మరునాడు అంగీకారం తెలిపాను. నేను అంగీకరించటంలో నా స్వార్థం గూడ భాగస్వామి. ముఖ్యంగా నన్నొక అధికారిగా చూడాలని పైసాలు కూడబెట్టి బి.ఇ. చదివించిన నా తల్లిదండ్రుల ఆశయం మేరకు, నా చెల్లాయికి ఘనమైన సంబంధం చేయాలని, నా జీవితంమీద పెంచుకున్న ఎన్నో ఆశల మేరకు నా అంగీకారం తెలియజేశాను సార్! అంగీకారం తెలియచేసిన పదిహేను దినాలకే "కాలేజి కుర్రాడు" చిత్రానికి కూడ డూప్ పని ఉంది. వెంటనే రండి" అని పిలుపొచ్చింది. సెలవు పెట్టి మద్రాసు వెళ్లాను. మూడు రోజులు సెలవు పెట్టిన నేను ముప్పది రోజులకు వచ్చేటప్పటికి లాడ్జిలో నా 'జాబ్' కాస్తా పోయింది.

తప్పనిసరై జీవనోపాధికి కుటుంబంతో మద్రాసు చేరాను. అప్పటి సుమంత్ గారి చిత్రాలన్నిటిలో పాల్గొనేవాణ్ణి, కాని ఆ డబ్బుతో ఈ సిటీలో అంతమంది జీవించాలంటే ఎంత కష్టమో మీకు తెలిసే ఉంటుంది సార్. ఆ పరిస్థితిలోనే ఇష్టంలేకున్నా మీ యూనిట్ లైట్‌బోయ్‌గా చేరాను. చెప్పటం ఆపి "విసుగనిపిస్తుందా సార్" అనడిగాడు

"అ లేదు లేదు. ఇంటరెస్టింగుగా ఉంది, చెప్పండి" అన్నాను.

"పరిశ్రమలో చేరి మూడేళ్ళు దాటినా లైట్‌బోయ్‌గా, డూప్ హీరోకన్న ఎక్కువ ఎదగలేకపోయాను. ఈ మూడేళ్ళు కష్టపడిన దానికి నేననుకున్న నా చెల్లాయికి వివాహం చేశాను. నాకు తండ్రి బిరుదు సంపాదించి పెట్టిన పెద్ద వాడి మాటను మరో ఇద్దరు బలపరచారు. అప్పుడే నా భార్యకు పిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించాను అది సక్సెస్‌గాక ఆమెకు పెద్ద జబ్బు చేసింది. ఇప్పటికే నా భార్య రోగాలతోనే బాధపడుతున్నా మందులిప్పించగల స్థితిలో లేను సార్. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి ఏర్పడింది. ఆ రోజుల్లోనే సుమంత్ గారి చిత్రానికి మదుమలై అడవులలో పనిచేస్తున్నాను అప్పుడు ఇంటి వద్ద నుంచి లెటర్ వచ్చింది. దాని సారాంశం హైద్రాబాదులో ఆ నెల 28న ఇంటర్వ్యూ ఉందని. ఇన్నాళ్ళూ నాకో డిగ్రీ ఉన్న సంగతి మరచిపోయాను. ఇన్నాళ్ళకి చదివిన 'బి ఇ.' డిగ్రీకి ఒక సార్థకత ఏర్పడుతుందనే సంతోషంతో యూనిట్ మేనేజరు గారికి చెప్పాను. వారు చెప్పింది విని ఆశ్చర్యపోవటం నా వంతయింది. ఈ విషయం తెల్సిన నిర్మాత, దర్శకులు వచ్చి 'చూడండి మిస్టర్! మీరు ప్రభుత్వ ఉద్యోగి కాబోతున్నారంటే మాకు సంతోషం కాని చూశారా మీరీ సమయంలో వెళ్ళారంటే ఈ షెడ్యూల్ కాన్సిలవుతుంది. కాన్సిలవుతే కొన్ని లక్షలు నష్టమవుతుంది. ఇదే షూటింగ్ ఏ అడవిలోనయినా పర్వాలేదు ఇలాంటి పరిస్థితిలో మాకెంత నష్టమో ఆలోచించండి మిమ్మల్ని నమ్ముకొని మరే డూప్ హీరోనూ తీసుకురాలేదు. అలాటప్పుడు మరో షెడ్యూల్ వేసి ఈ అడవిలోకి రావాలంటే చదువుకొన్నావారు, మీరూ ఆలోచించండి' వారు బాధ వారు చెప్పుకెళ్ళారు. ఎదిరించి వెళ్ళదామంటే ఆ అడవికి ప్రత్యేక బస్సులు లేవు. చేతిలో డబ్బుల్లేవు. ఇలాంటి పరిస్థితుల్లో వారి మాటను కాదనిలేక, అటు వెళ్ళనూ వీలులేక మానుకున్నాను.

"తరువాత రెండు నెలలకే నేనూహించని ఘోరమైన వార్త నాన్నకు యాక్సిడెంట్. నా వ్యధ ఎంతఉన్నా నా కర్తవ్యాన్ని సరిగ్గానే నిర్వర్తించేవాణ్ణి కాని నా జీతంతో ఇల్లు గడవక నాన్న - సబ్బుల కంపెనీలో సేల్స్‌మన్‌గా చేరాడు. అప్పుడే సైకిల్‌మీద వెడుతున్న నాన్నను సిటీ బస్సు కొట్టింది. ఇప్పుడాయన పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇప్పుడు నా కర్తవ్య మేమిటో చెప్పండి సార్! ఇటు తల్లి పసుపుకుంకుమలు నిలబెట్టనా! రోగాలతో బాధ పడుతున్న నా భార్యను కాపాడుకోనా! చెప్పండి సార్! నా కర్తవ్యం ఏమిటి సార్? నేను దేనికోసం ఈ ఫీల్డ్‌లో ఎందుకు అడుగుపెట్టానో! ఆ డబ్బు కోసం ఫలులతో పోరాడాను మోటారు సైకిళ్ళతో గాలిలో తేలాను. మేడలని ఎగిరి దూకాను. నా కుటుంబాన్ని ఓ దారికి తీసుకురావాలనే గదా సార్ నా ప్రయత్న మంతా? ఇంత చేసి తల్లి పసుపుకుంకుమలను, భార్యాబిడ్డలను రక్షించుకోలేని నా కర్తవ్యమేమిటి సార్! దయచేసి మీరైనా చెప్పండి సార్!" అంటూ తల వంచుకున్నాడు. తలెత్తిన అతని కంటినిండా నీళ్ళు.

"భయపడకు మిస్టర్! సమస్యలన్నీ పరిష్కార మవుతాయి. నచ్చచెప్పను ప్రయత్నించాను.

"నా జీవితాన్ని మీ ముందు ఉంచాను సార్! పరిష్కారము మీరే చూపించాలి సార్!, కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్. ఆపరేషనుకు మూడు వారాలు టైం ఉంటుందంటున్నారు గదా! వచ్చే ఆదివారం కనిపించండి, చూస్తాను."

"థాంక్యూ సార్" అంటూ భారంగా అడుగులు వేసుకుంటూ వెళుతున్న అతను కనుమరుగయ్యేవరకు చూశాను.

ఆదివారం

కిరణ్‌ను పోయిన వారమే రమ్మన్నాను. రెండు వారాలైనా రాలేదు. కిరణ్ గూర్చే ఆలోచిస్తున్నాను. షాట్ రెడీ అయ్యేటప్పటికి సెట్‌మీద కెళ్ళాను. అక్కడ మా యూనిట్ మేనేజరు ఎదురయ్యాడు. నెల రోజులు అవుట్‌డోర్ కని బొంబాయి వెళ్ళిన యూనిట్ మేనేజరును చూసేటప్పటికి ఆశ్చర్యమని పించింది.

"ఎప్పుడొచ్చారు? షూటింగ్ అయిపోయిందా!" అనడిగాను.

"మీకు తెలియదా సార్! మన యూనిట్ లైట్‌బోయ్ అదే సార్ డూప్ హీరో కిరణ్ మొన్న చనిపోయాడు సార్" అన్నాడు

నిశ్చేష్టుడనయ్యాను. "ఈజ్ ఇట్?" నమ్మలేనట్లుగా అడిగాను. "అవును సార్! మొన్న హోటల్ రిట్జ్ ఏడవ అంతస్తు పైన సుమంత్‌గారికి డూప్‌లో పాల్గొన్నాడు. ప్లాట్ మీద దూకటంలో జారిపడిపోయాడు."

మనసు భారమైంది తన కుటుంబానికి పరిష్కారం చూపకమునుపే తన జీవితానికే భగవంతుడు పరిష్కారం చూపించాడు. అతని ఆలోచనలతో ఇంటి కెళ్ళాను పి. ఎ. ఉత్తరాలు తెచ్చిపెట్టాడు.

"ఫ్రం ఉదయకిరణ్" చూడగానే గుండెలు అదరసాగాయి. ఆత్రుతగా చించాడు.

'సార్ బహుశా ఈ ఉత్తరం చదివేటప్పటికి నే నీ లోకంలో ఉండనేమో! చనిపోయే ముందు మిమ్మల్ని ఒకసారి కలుసుకొందా మనుకున్నాను. కాని వీలుకాలేదు. చనిపోవాలని ఇదివరలో ఎన్నోసార్లు అనుకొన్నాను కాని నేను వెళితే నా కుటుంబం దిక్కులేని దవుతుందని భయపడ్డాను. నేను వుంటే ఉద్ధరించేదీ లేదు, లేకున్నా నా కుటుంబానికి ఒరిగేదీ లేదని ఆలశ్యంగా తెలుసుకొన్నందున ఇంతకాలం ఉన్నాననిపిస్తుంది. ఎంతో ఆలోచించి ఈ నిర్ణయాని కొచ్చాను. అందరనుకున్నట్లు జారిపడి మరణించటం కాదు. ఇది నా ప్రయత్నమే. ఒక షాట్‌కోసం మరణిస్తే కొన్ని ప్రతికలయినా హర్షిస్తాయి. నిర్మాతల నుండి, మీ యూనిట్‌నుండి కొంత డబ్బు నష్టపరిహారంగా అందుతుంది. అది నా కుటుంబానికి అందచెయ్యండి. నా మీద కొండంత బలం పెట్టుకున్న తల్లిదండ్రులు నా దౌర్బల్యం మూలంగా బలికాగూడదు. అందుకే ఆ బాధను భరించలేక ఈ నిర్ణయం తీసుకున్నాను. నా సమస్యకు ఇదే ముగింపు. అభాగ్యుడు 'ఉదయ్‌కిరణ్.

ఉత్తరం ముగించేసరికి నాకు తెలియకుండానే నా కళ్ళు చెమ్మగిల్లాయి.